

ప్రజ్ఞ వికాసం పరీక్షకు విశేష స్పందన


ప్రజ్ఞ వికాసం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలో 10వ తరగతి విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాసం పరీక్షలకు విశేష స్పందన లభిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక స్థానిక సుధా కాలనీలోని శ్రీ విద్యానిధి స్కూలులో ప్రజ్ఞ వికాసం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 43 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలను పాఠశాల ఉపాధ్యాయులు మూర్తి పర్యవేక్షించారు.

లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో కేంద్ర కార్మిక సంఘాల నేతల డిమాండ్



కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ చట్టాలను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరు రాజు మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలను పెంచేందుకు కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. ఆనాడు పార్లమెంటులో వైసిపి, టిడిపి పార్లమెంటు సభ్యులు వీటికి మద్దతుగా నిలిచారని అన్నారు. ఇవి అమలులోకి వస్తే భారీ పరిశ్రమలు సైతం కార్మిక చట్టాల నుంచి మినహాయించబడి వాటిలో పనిచేసే కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాలు తమ బలప్రయోగంతో లేబర్ కోడ్‌లతో ఇష్టానుసారం మార్పులు చేసి కార్మికుల శ్రమను మరింత దోచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశాలు కల్పించిందన్నారు. 500 లోపు కార్మికులు ఉండే పరిశ్రమలలో సేఫ్టీ అధికారి ఉండాల్సిన అవసరం లేదని, అంబులెన్స్ కూడా తొలగించుకోవచ్చనే ప్రమాదకర నిర్ణయాలు ఈ లేబర్ కోడ్లలో ఉన్నాయని తెలిపారు. యాజమాన్యాలు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ లాంటి ప్రాథమిక చట్టాలను అమలు చేయకపోయినా వాటిపై విధించే శిక్షలను ఈ లేబర్ కోడ్లలో తొలగించి దేశ కార్మిక వర్గాన్ని ఏ హక్కులు లేని బానిసలుగా మారుస్తున్నారని అన్నారు. దీనికి వ్యతిరేకంగా సంఘాలతో నిమిత్తం లేకుండా కార్మికులందరూ ఐక్య పోరాటాలు నిర్వహించడానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, కోశాధికారి మలకా వెంకటరమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాదు, ఆఫీస్ కార్యదర్శి రాణి, అజయ్‌కుమార్, పాసుబాబు, చంద్రరావు, త్రిమూర్తులు, మెస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఏడుకొండలు, సాల్మన్ రాజు, విజయ్, ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాఘవులు, యేసు, బాలరాజు, దుర్గారావు, నాగేశ్వరరావు, ఎఐసిసిటియు నాయకులు నరసరాజు తదితరులు పాల్గొన్నారు.


వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఉపాధి పనులను ముమ్మరం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో రానున్న 45 రోజుల పాటు అధిక సంఖ్యలో కూలీల హాజరుతో ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డ్వామా, పంచాయితీరాజ్, మండల పరిషత్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్లు, గోకులం పశువుల షెడ్లు తదితర పనులన్నింటినీ మార్చి మాసాంతానికి పూర్తి చేయాలని ఆదేశించారు. పారంభం కాని పనులన్నింటిని వెంటనే మొదలు పెట్టాలని అన్నారు. గ్రౌండ్ చేసిన పనుల వివరాలు, వాటికి ఎఫ్‌టిఒల జనరేషన్, బిల్స్ అన్‌లైన్ అప్ లోడింగ్ ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని ఆదేశించారు. మంజూరు చేసిన ప్రతి పని తప్పనిసరిగా పూర్తి కావాలని, మంజూరు చేసిన ఒక్క రూపాయి కూడా వృధా కారాదన్నారు. నిర్దేశించుకున్న పనిదినాల లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధి పనులకు హాజరౌతున్న కూలీల సంఖ్యను రానున్న 45 రోజుల పాటు మరింత పెంచాలని సూచించారు. ఈ వారం కూలీల హాజరు శాతం ఏలేశ్వరం మండలంలో బాగుందని కలెక్టర్ ప్రసంశించి, ఉపాధి పనుల అవసరం, అవకాశం ఎక్కువగా ఉన్న కోటనందూరు మండలంలో ఆశించిన స్థాయిలో లేక పోవడం పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

రెడ్ క్రాస్ సభ్యత్వాలు ముమ్మరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ, సేవ కార్యక్రమాల నిర్వహణలో గడచిన 30 ఏళ్లుగా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్న ఆదర్శనీయ ఒరవడిని కాకినాడ జిల్లా కొనసాగించేలా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. సమాజ హితం, ఆపన్నుల సహాయం కోసం చేసే ప్రతి కృషి అనిర్వచనీయమైన సంతోషాన్ని, తృప్తిని అందిస్తుందన్నారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ పెద్ద స్థాయిలో చేపట్టాలని ఆయనకోరారు. రూ.1 లక్ష విరాళం సేకరించిన వారిని వెండి పతకంతోను, రూ.2 లక్షలు ఆపై విరాళాలు సేకరించిన వారిని గోల్డ్ మెడల్‌తోను రెడ్ క్రాస్ సొసైటీ సత్కరిస్తుందని కలెక్టర్ తెలిపారు.

శివరాత్రి ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టండి

ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు, రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సందర్శకుల కొరకు రవాణా, తాగునీరు, సురక్షిత స్నాన ఘట్టాలు, దుస్తుల మార్చుకునేందుకు చేంజింగ్ రూంలు, మరుగుదొడ్లు, బారికేడింగ్, లైటింగ్, సూచనలు ఇచ్చేందుకు, తప్పిపోయిన వారి జాడ తెలిపేందుకు మైక్ సిస్టమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పారిశుద్య పరిరక్షణ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, పంచాయితీరాజ్ ఎస్ఇ ఎవిఎస్.శ్రీనివాస్, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ప్రసాద్‌బాబు, ఎంపిడిఒలు, ఏపీడీలు, పంచాయితీ రాజ్ ఇఇలు, ఎఇలు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి


కళాశాలల ప్రిన్సిపల్స్‌తో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ఇంటర్మీడియట్ ప్రీ ఫైనల్ పరీక్షల ఉత్తీర్ణశాతం వివరాలు, మార్చి ఒకటి నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నాయని, ఈ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల విద్యా బోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా రానున్న 25 రోజులు జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను వివిధ కేటగిరీలుగా విభజించి చదివించాలన్నారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై మరింత దృష్టి సారించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డిఐఇఒ జిజికె.నూకరాజు, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


మంత్రికి సమస్యను వివరిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో సాగునీటి సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ కోరారు. బుధవారం నిడదవోలు పర్యటనకు వచ్చిన ఆయనను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో సాగునీటి సమస్యలకు సంబంధించి వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో నాలుగు ప్రధాన జలాశయాలు ఉన్నప్పటికీ అవసరమైన నీరు రైతులకు అందడం లేదన్నారు. ఇదే విషయంపై అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం దాల్వా పంటలకు సాగునీరు లేక నియోజకవర్గంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తక్షణమే రైతులకు నీరు అందించేలా కృషి చేయాలని మంత్రికి వివరించారు. ఏలేరు కాలువకు ఆధునీకరణ చేపట్టి తూములు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి రామానాయుడు అధికారులను ఆదేశించారని ఎంఎల్ఎ స్థానిక మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొల్లపల్లి బుజ్జి, పర్వత సురేష్, ఇళ్ల అప్పారావు, అమరాది వెంకట్రావు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక బడ్జెట్ పత్రాల దహనం

ప్రజాశక్తి - కరప, తాళ్లరేవు

కేంద్ర ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బడ్జెట్ పత్రాలను కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. బుధవారం స్థానిక రామకంచినగర్ కాలనీ వద్ద వరి పొలాల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంగం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగ వ్యతిరేకమైనదని అన్నారు. ఎరువులు, పురుగులు మందులపై ఉన్న రాయితీని పూర్తిగా ఎత్తివేసిందన్నారు. వ్యవసాయ రంగం రైతుకు భారం అనే రీతిలో కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రధానంగా కౌలు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించటం లేదని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెబుతుందని, అయితే తొలకరిపంట అయిపోయి దాళ్వా పంటకు వచ్చిన ఇప్పటికీ రైతు పెట్టుబడి సాయంగా ఇస్తామన్నా రూ.20 వేలను నేటికీ వెయలేదన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేటు సంస్థలకు కట్టబట్టేందుకు చూస్తుందన్నారు. కరోనా కాలంలో టివి, సెల్ అనేక సదుపాయాల లేకపోయినా ప్రజలు జీవించారని, కానీ తిండి లేకుండా బ్రతకలేరన్నా సంగతిని కరోనా రుజువు చేసిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులను ఆ రంగం నుంచి తరిమివేసేందుకు కుట్రలు సాగిస్తున్నాయని అన్నారు. అందులో భాగమే రైతులకు ఇచ్చే ఎరువులపై రాయితీలను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అయినా రైతు పెట్టుబడి సాయం అందించేలా బడ్జెట్‌ను ప్రవేశ ఎట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.రమణి, రైతులు రాయుడు అప్పన్న, వాసంశెట్టి సత్యనారాయణ, యాళ్ళ సోమన్న, ఆచంట కృష్ణ, నల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, చెరువు గట్టు సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రూ .12 లక్షలపైన ఆదాయం ఉన్నవారికి రాయితీలు కల్పించిన ప్రభుత్వం, పేదలకు మాత్రం మొండి చెయ్యి చూపించిందన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కేటాయింపులు లేకుండా ఆదానీ, అంబానీలకు రాయితీలు కల్పించడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ఆశా వర్కర్ల సంఘం నాయకులు నాగలక్ష్మి, అనంతలక్ష్మి, విఒఎల సంఘం నాయకులు రత్నకుమారి, చెక్కా లక్ష్మి, ఈశ్వరి బాయి, అంగన్‌వాడీలు, మిడ్డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు.


కరపలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతులు


తాళ్లరేవులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పారిశుధ్య పనుల తనిఖీ


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ భావన

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో చేపడుతున్న పారిశుధ్య పనులను నగర పాలక సంస్థ కమిషనర్ భావన బుధవారం పలు ప్రాంతాల్లో పరిశీలించారు. 37వ డివిజన్ అంబేద్కర్ భవనం ప్రాంతంలో పారిశుధ్య పనుల నిర్వహణ తనిఖీ చేశారు. రోడ్లు, డ్రెయిన్ల పరిశుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ ఎలా జరుగుతోంది వంటి విషయాలపై ఆరా తీశారు. అనంతరం 26 డివిజన్లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం


గర్భిణులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, వారి సహాయకులకు అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన 8వ నెల గర్భిణీ పుప్పల అషిత భర్త నవీన్, ఆమె కుటుంబ సభ్యుల సాయంతో 14 రకాల పౌష్టికాహార వంటకాలతో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పల అషిత, నవీన్, శ్రీను, తులసి, గ్రూపు సభ్యులు హైదర్ అలీ, రాజేష్ కుమార్, నవీన్ నాని, లోకేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వ్యర్థాల వేరు చేసే పనులు ప్రారంభం


కంపోస్టు యార్డులో యంత్రాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణానికి చెందిన డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలను వేరు చేసేందుకు అవసరమైన ప్లాంట్‌కి సంబంధించిన పనులు ప్రారంభించారు. భారీ యంత్రాలను, ప్రోక్లైన్‌ను సిద్ధం చేశారు త్వరలో పూర్తిస్థాయిలో పనులు నిర్వహించి వ్యర్థాలను వేరుచేసి తరలిస్తామని నగర పంచాయతీ ఎఇ ప్రభాకర్ తెలిపారు.

7న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం, యు.కొత్తపల్లి


ఏలేశ్వరం పరిధిలోని మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ బి.వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చైతన్య నగర్, సి రాయవరం కాలనీ, గొల్లల మెట్ట, దిబ్బలపాలెం, లింగంపర్తి రోడ్, మార్కెట్ రోడ్, కాలేజీ రోడ్డులో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే యు.కొత్తపల్లి మండలంలో ఈనెల 7వ తేదీన పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారను. ఉప్పాడ, కొత్తపల్లి, కొండవరం, నాగులపల్లి, కుతుకుడు మిల్లి, వాకతిప్ప, అమీనాబాద్, మూలపేట వాటర్ వర్క్స్, కొత్త, పాత ఇసుకపల్లి, ఎండపల్లి, రమణక్కపేట తదితర గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

వంతుల వారి విధానంలో సరఫరా చేస్తున్న సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటిపల్లి సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు దాట్ల విజయ గోపాలరాజు కోరారు. బుధవారం మండలంలోని కోలంక గ్రామంలో ఆయన మాట్లాడారు. సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం రైతులు, కౌలు రైతులు వినియోగార్ధం వరి పంటకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా వంతులు వారి విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రెండు రోజులుగా మూడు రోజులుగాని ఒక వంతుగా క్రిందికి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి నెలకి సంబంధించి మసకపల్లి కింద సేద్యం చేసే రైతులు ఈ నెల 7 నుంచి 10 వరకు, 16 నుంచి 19, 25 నుంచి 28 వరకూ సాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

కార్టూ'నిజం'



స్టెమి ఇంజక్షన్‌తో గంటలో గుండెకు భరోసా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి - సామర్లకోట

స్టెమి ఇంజక్షన్‌తో గుండెపోటుతో ఉన్న వ్యక్తికి ఒక గంటలో ప్రాణాన్ని సంరక్షించే అవకాశం ఉందని, ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సామర్లకోట క్లస్టర్ హెల్త్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమల చెప్పారు. బుధవారం సామర్లకోట సిహెచ్‌సిలో స్టెమీతో గుండెకు భరోసా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి గంటలోపు చాతి నొప్పి, ఎడం భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలతో పేషెంట్లు ఆసుపత్రికి రాగానే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, మొదటి గంటలోనే రూ.45 వేలు విలువైన టినెక్టి ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా ఇవ్వడం ద్వారా ప్రాణాన్ని కాపాడవచ్చునని అన్నారు. అటువంటి సమస్యలు ఉన్నవారు ఆసుపత్రికి రాగానే ఇసిజి తీసి కాకినాడలో ఉన్న జిజిహెచ్ హబ్ వెంటనే రిపోర్టులు మెయిల్ ద్వారా పంపించి, వారి సూచనలు తీసుకుని వెనువెంటనే టినెక్టి ప్లస్ ఇంజక్షన్ పేషెంట్‌కు అందించడం ద్వారా గంటలోగా ప్రాణాలు రక్షించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య విధానంపై ఆసుపత్రి పరిధిలో గల ప్రజలకు విరివిగా ప్రచారం నిర్వహించి గుండె జబ్బు నుంచి సంరక్షించుకునేలా చూడాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ రమేష్, డాక్టర్ కార్తీక్,ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. స్టెమి ఇంజక్షన్ గుండెకు భరోసా అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు.


చెంత సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

చెత్త నుంచి సంపద సృష్టికి చర్యలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తడి, పొడి చెత్త నుంచి సంపదను సృష్టించడానికి కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణసత్యరెడ్డి సూచించారు. బుధవారం ఎండపల్లి, శ్రీరామపురం, రమణక్కపేట గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యం అమలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరుగున పడిన చెత్త కేంద్రాన్ని వినియోగం తీసుకొస్తే సంపదను సృష్టించవచ్చని తెలిపారు. మండలంలో ఉన్న చెత్త సంపద కేంద్రాల్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


భార్య, భర్తలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ కృష్ణభగవాన్

భర్త చెంతకు భార్య, పిల్లలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటకి చెందిన ఒక కుటుంబంలో భార్య భర్తల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదంతో భార్య నలుగురు పిల్లలను తీసుకుని బయటికి వెళ్లిపోయింది. జనవరి 28న జరిగిన ఈ సంఘటనపై భర్త స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు గుర్తించి బుధవారం వారిని భర్తకు అప్పగించారు. ఈ సందర్భంగా చిన్నపాటి వివాదంతో భార్య తన నలుగురు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోగా భర్త ఇచ్చిన ఫిర్యాదుపై వారి ఆచూకీ కోసం ప్రయత్నించినట్లు సిఐ ఎ.కృష్ణ భగవాన్ చెప్పారు. అయితే భార్య పిల్లలు హైదరాబాదులో ఉండడాన్ని తమ సిబ్బంది గమనించి వారిని వెంటబెట్టుకుని రాగా భార్యాభర్తలు ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించి భర్తకు భార్య పిల్లలను అప్పగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు రెండున్నరేళ్లు జైలు

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యం సేవించి, రాంగ్ రూట్‌లో వాహనాన్ని నడిపి మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి మతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండున్నరేళ్లు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు బుధవారం తీర్పునిచ్చారు. పిఠాపురం సిఐ జి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం..2021 ఆగష్టు 13న పట్టణంలోని స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఎస్ శ్రీనివాసరావు తన డ్యూటీ ముగించుకుని మోటారు సైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా చిత్రాడ వాటర్ ట్యాంక్ సమీపంలో మద్యం సేవించి, వేగంగా తప్పుడు మార్గంలో వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై నమోదు అయిన కేసులో అప్పటి సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ దర్యాప్తు చేసి విశాఖ జిల్లా కోటవురట్ల మండలం, బోడపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పి.అప్పలనాయుడును అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాల అనంతరం ముద్దాయిపై నేరం రుజువు కావడంతో అతనికి రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం బాబు తీర్పునిచ్చారన్నారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ప్రకాష్ రావు, జి.వినయ ప్రతాప్ వాదనలు వినిపించారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - కాజులూరు

అగ్ని ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాజులూరు శ్రీరామ్‌నగర్ కాలనీలో కొత్తూరు రాజేశ్వరి (70) తాటాకు ఇంట్లో నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ నిలిచిపోవడంతో అగ్గి పెట్టితో దీపం వెలిగించే క్రమంలో ఆమె చీరకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఆమె 80 శాతం కాలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో బుధ వారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మర్లావ గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. అలాగే కాకినాడ ఎసిఇఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మురారి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 11 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ, ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

కొవ్వూరు పట్టణానికి చెందిన ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. కొవ్వూరుకు చెందిన కర్ర అవినాష్ కుమార్ ఈ నెల1న స్నేహితులతో కలిసి చాగల్లు వెళ్లారు. తిరిగి వస్తుండగా అర్ధరాత్రి చాగల్లులెపి వెంకటకృష్ణ థియేటర్ రోడ్డులో చాగల్లుకు చెందిన కోతాడ నాగ శివ సాయి కుమార్, తొర్లపాటి దుర్గాప్రసాద్ కలిసి అవినాష్ కుమార్‌పై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. బాధితుని ఫిర్యాదుపై సాయికుమార్, దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి బుధవారం నిడదవోలు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని నెలటూరుకు చెందిన వివాహిత ఆలపాటి రామలక్ష్మి రెండు రోజుల క్రితం ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటి నుండి వెళ్లిపోయినట్టు ఆమె భర్త ఆలపాటి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మహిళ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చోరీ, దాడి కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి - కడియం

దొంగతనం చేసి పారిపోతూ, అడ్డుకున్న వ్యక్తిని కత్తితో పొడిచిన కేసులో ముద్దాయికి జడ్జి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. 2020లో కడియపులంకలో ఒక ఇంట్లో దొంగతనం చేసి పారిపోతూ అడ్డొచ్చిన వ్యక్తిని పొడిచినట్టు వచ్చిన ఫిర్యాదుపై అప్పటి మహిళా ఎస్ఐ షేక్ అమీనా బేగం కేసు నమోదు చేశారు. ముద్దాయి నేతల రాజేష్‌ను అరెస్టు చేశారు. నేరం రుజువడంతో జడ్జి ఒక సంవత్సరం జైలుశిక్ష విధించినట్లు సిఐ తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులకు ప్రజాసంఘాల మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్. శ్రీనివాస్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 27 న జరిగే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులుకు మండల ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో పిడిఎఫ్ అభ్యర్థికి చెందిన ప్రచార కరపత్రాన్ని ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ పలు సమస్యలపై వివిధ రూపాలలో పోరాడే ప్రజల గొంతు శాసనమండలిలో వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయ రంగంలో విశేష కృషి చేసిన అనుభవం ఉన్న నాయకుడు డివి. రాఘవులు అని అన్నారు. ఆయనకు పట్టభద్రులు ఓట్లు వేసి గెలిపించేలా ప్రజాసంఘాల నాయకులంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు, యానిమేటర్ల సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావు పేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో బుధవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థినులకు సైన్స్ పాఠ్యాంశాలపై ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలలో పోషణ, జంతువులలో పోషణ, ఉష్ణం, వివిధ రకాల ఆహార పదార్థాల పరీక్షలు, సూక్ష్మదర్శిని ద్వారా ఫంగస్ పరిశీలన వంటి ప్రయోగాలు విద్యార్థులతో చేయించి అవగాహన కల్పించారు. ఈ విద్యార్థులను సైన్స్ సెంటర్‌కు తీసుకువచ్చేందుకు ప్రతిభ విద్యా నికేతన్ డైరెక్టర్ శ్రీ ప్రకాష్ ఉచితంగా బస్సు ఏర్పాటు చేసినందుకు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

యానాం వార్తలు

లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎ గొల్లపల్లి


వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి

ప్రజాశక్తి - యానాం

యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్‌ను పుదుచ్చేరిలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా యానాంకు సంబంధించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు అలాగే చేపట్టవలసిన అభివృద్ధి పనులు, పథకాలు అమలు తదితర అంశాలపై లెఫ్టింనెట్ గవర్నర్‌తో చర్చించారు. వినతి పత్రాన్ని అందించారు. పుదుచ్చేరి ఎంఎల్ఎ శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లితో పాటు జాన్ కుమార్, కళ్యాణసుందరం, తదితరులు ఆయనను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునుస్వామి

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. బుధవారం యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవాధృక్పదాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రజలను చైతన్య పరచాలని ఆయన కోరారు. అలాగే డెంగీ, మలేరియా వంటి వ్యాధులు గురించి, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ చెల్లి నరేష్, పెద్దిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారంను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెస్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ ముత్యాలు, డాక్టర్ జెవి.సుధాకర్, సూపరింటెండెంట్ బచ్చుల విజయసాగర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు మల్లాడి అభినందన

పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ప్రత్యేక బహుమతులు సాధించిన శారదా విద్యానికేతన్ విద్యార్థులు చింతా దుర్గాలక్ష్మి షణ్ముఖప్రియ, సంగాడి అజయ్‌లను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందించారు. స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు కె.సురేష్‌కుమార్‌ను ఆయన అభినందించారు. మల్లాడి అభినందించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిక్కాల వెంకటేశ్వర రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా వెంకన్న, సాలిగ్రామ సుబ్బారావు, అలీషా భాషా పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ బాధ్యత వహించాలి

-ముద్రగడ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

-మాజీ మంత్రులు అంబటి, కొట్టు, పేర్ని


ముద్రగడను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు అంబటి, కొట్టు, పేర్ని

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ముద్రగడ ఇంటిపై జరిగిన దాడికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ బాధ్యత వహించాలని మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, పేర్ని నాని, డిమాండ్ చేశారు. బుధవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వచ్చిన వారు ముద్రగడతో భేటీ అయ్యారు. జరిగిన దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన ఒక కార్యకర్త అర్ధరాత్రి వచ్చి ఎవరి ప్రేరేపన, ప్రోద్బలం లేకుండా దాడికి పాల్పడం సాధ్యం కాదన్నారు. దీని వెనుక ఎవరో ఉన్నట్లుగానే భావించాల్సి వస్తుందన్నారు. కాపు ఉద్యమాన్ని నడిపేందుకు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నటువంటి ముద్రగడను ఈ రకంగా పరామర్శించాల్సి వస్తుందని ఊహించలేదన్నారు. ఒక నాయకుడు ఇంటి మీదకు అర్ధరాత్రి పూట ఒక వ్యక్తి వచ్చి బీభత్సం సృష్టించిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నో దఫాలు తెలుగుదేశం పార్టీ ఆయనను అవమానాలకు గురి చేసిందని ఆరోపించారు. ఆయన స్వగృహం మీద జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. జై జనసేన అంటూ దాడి చేస్తే ఆ పార్టీ నాయకుడు స్పందించకపోవడం బాధ కల్గిస్తుందన్నారు. ముద్రగడ ఇంటి మీద దాడి చేస్తే మా పార్టీ కాదని, మా పార్టీ జెండా మోశాడు అంతే అని, ఏదో మత్తు ఇంజక్షన్ చేసుకుని వచ్చాడని మా పార్టీకి సంబంధం లేదని కొంతమంది మాట్లాడటం దారుణమన్నారు. మీరు చెప్పినట్టు మత్తు ఇంజక్షన్ తీసుకొని వచ్చాడా? గంజాయి సేవించాడా? అనేది పక్కన పెట్టి దీనికి బాధ్యత వహించవలసిన వ్యక్తులు ఎవరని ప్రశ్నించారు. నేను ఫలానా తాలూకా వ్యక్తిని, ఫలానా పార్టీ జండా మోసిన వాడిని అని ఇంటి మీదకు వచ్చి రచ్చ చేసిన ఆ పార్టీ నాయకులు స్పందించకపోవడం దారుణవన్నారు. కూటమి ప్రభుత్వం ఎక్కిన 30 రోజుల్లో గంజాయిని ఆపుతాం, మత్తుమందులు ఆపుతామని ప్రగల్బాలు పలికారని, ఆ మాటలు ఇప్పుడు ఏమయ్యాయని అన్నారు. హోం మంత్రి గాని, ఆ పార్టీకి సంబంధించిన నాయకుడు గాని, అన్ని శాఖలను నేనే చూస్తానని అన్న మంత్రి కూడా నోరు మెదపడం లేదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఈ సంఘటనకు బాధ్యత వహించాలని అన్నారు. ముద్రగడను పరామర్శించిన వారిలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అడపా శేషు, నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు.

సదస్సులతో విషయ పరిజ్ఞానం పెంపు

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయని పలువురు విద్యావేత్తలు అన్నారు. బుధవారం ఆదిత్య విశ్వవిద్యాలయంలో 'సమాచార వ్యవస్థలలో కృత్రిమ మేథస్సు యొక్క భవిష్యత్తు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో యుఎస్ఎలోని సౌత్ యూనివర్శిటీ ప్రొఫెసర్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ గిల్ సింగిల్టరీ డేటా ప్రాసెసింగ్, వ్యాపారంలో ఆటోమేషన్, పరిశ్రమలపై పెరుగుతున్న ప్రభావంపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క పరివర్తన ప్రభావంపై వివరించారు. ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డాక్టర్ పిఎస్.రంజిత్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మహ్మద్ తాజ్ మాట్లాడుతూ ఈ రకమైన సదస్సులు ఈ రకమైన సదస్సులు విద్యార్థులకు మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి, వివిధ రంగాల్లో వారి పరిజ్ఞానాన్ని విస్తృతం చేసుకోవడానికి దోహదం చేస్తాయన్నారు.

వికలాంగులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యవసరాలను అందిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు ప్రవీణ్ రెడ్డి, మేరీ ఆర్థిక సాయంతో 20 మంది వికలాంగులకు నిత్యావసర సరుకులను అందజేశారు. బుధవారం కోరంగిలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు నరవ రాజు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయ కిట్లను, అందజేశారు. ఈ సందర్భంగా నరవ రాజు మాట్లాడుతూ ఈ ఎడాదిలో ట్రస్ట్ ద్వారా వికలాంగులు, కుష్టి వ్యాధిగ్రస్తులు, అనాథలకు పలు సేవకార్యక్రమాలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరి, ప్రశాంత్, గణేష్, ఉషోదయా మండల వికలాంగుల సమైఖ్య అధ్యక్షుడు కె.శ్రీనివాస్, గుత్తుల సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అపరాల పంటపై పొగాకు లద్దె పురుగు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్యోతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని పలు వ్యవసాయ క్షేత్రాలలో మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఆశించిందని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి అన్నారు. బుధవారం ఎర్రవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పొగాకు లద్ది పురుగు పంటలకు చేసే హాని, నివారణకు గుళికలు తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. లద్దె పురుగు ఆకు దశ, పూత పిందె దశలలో విపరీతంగా నష్టం కలుగజేస్తుందన్నారు. నివారణకు 5 కిలోల తౌడులో 500 గ్రాములు బెల్లం, 250 ఎంఎల్ క్లోరాపైరిపాస్ కలిపి విషపు ఎరను తయారు చేసుకోవాలన్నారు. తయారు చేసుకున్న ఎరను చిన్న చిన్న ఉండలుగా చేసుకుని సాయంత్రం వేళల్లో పంటలో అక్కడక్కడ చల్లాలని అన్నారు. ఎకరం పొలంలో 10 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేయడం ద్వారా నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉందంటున్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ అఖిలాండేశ్వరి, విహెచ్ఎ నానిబాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గమ్యం విద్యార్థులకు బహుమతుల అందజేత


బహుమతులు అందిస్తున్న ఎంఎల్ఎ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో గొల్లల మామిడాడకు చెందిన గమ్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విజయం సాధించి గమ్యం స్కూల్ బాధ్యతను మరింత పెంచారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రతిష్టాత్మక కెవిబి ఇన్‌స్పైర్ ఆల్ ఇండియా చిల్డ్రన్స్ డే' పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు బి.వంశిక, టి.భువన్‌రాజ్‌సాయి, టి.సారికకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

అసంఘటిత కార్మికులు ఈ శ్రమ్ కార్డును పొందాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

అసంఘిటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డును తప్పనిసరిగా పొందాలని పిఠాపురం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బుల్లిరాణి సూచించారు. బుధవారం స్థానిక రామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద అసంఘటిత కార్మికులకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ-శ్రమ్ నమోదుకు 16 నుంచి 59 సంవత్సరాల మధ్య కార్మికులు అర్హులని, ఈ-శ్రమ్‌లో నమోదైన కార్మికులకు ఉచిత గుర్తింపు కార్డు జారీ అవుతుందన్నారు. ఈ-శ్రమ్ పథకంలో నమోదయిన వలస కార్మికులు ఏ రాష్ట్రం వారైనా, రేషన్ కార్డు లేకపోయినా పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డులు, నిత్యావసర సరకులు అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అనిశెట్టి నూకరాజు, మాజీ అధ్యక్షుడు మొగలి వరప్రసాద్, కార్మిక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఉప్పాలమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - కరప

కరప గ్రామంలోఉప్పాలమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. తొలుత ఆలయంలో పంతం సందీప్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, ముద్రగడ రమేష్, పేకేటి దుర్గాప్రసాద్, నల్లె ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

గీత కులానికి 3 మద్యం షాపుల కేటాయింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాల వారికి 3 మద్యం షాపులు కేటాయించబడ్డాయని ఎక్సైజ్ సిఐ అర్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో 1, గండేపల్లి మండలంలో 1, జగ్గంపేట మండలంలో 1 కేటాయించారన్నారు. ఈ షాపుల కోసం దరఖాస్తు చేసుకునేవారు రిపెండబుల్ ఫీజ్ రూ.2 లక్షలతో పాటు నేటివిటీ, కుల ధ్రువీకరణ, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఈ నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పుష్కరిణిలో నీరు తొలగింపు ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి నిమిత్తం పుష్కరంలోని నీటిని తొలగిస్తున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్,కార్యనిర్వహణాధికారి శ్రీకాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 తేదీ నుంచి 17 తేదీ వరకు పుష్కరణి నందు ప్రస్తుతం ఉన్న నీరు పూర్తిగా తీసి మళ్ళీ కొత్త నీరు పెట్టి పూర్తి స్థాయి నీటి మట్టంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్.జగన్ పాలనలో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - దేవరపల్లి

రాష్ట్ర విభజన కంటే జగన్ మోహన్ రెడ్డి పాలన వల్లే రాష్ట్రం ఎక్కువ నష్టం పోయిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్ హాల్లో మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ కన్వీనర్ల సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. గత ప్రభుత్వంలో కక్షలు, వేధింపులే ధ్యేయంగా పాలన చేశారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో రాష్ట్రాభివద్ధి అట్టడుగు స్థాయికి దిగజారిపోయిందన్నారు. పరిశ్రమలు తరలి వెళ్లిపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. ప్రస్తుతం జరిగే పట్టభద్రుల ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు కూటమి ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, దేవరపల్లి టిడిపి అధ్యక్షుడు ఆండ్రు అనిల్, కాట్నం గణేష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో ఎస్‌పి తనిఖీలు


సామర్లకోట పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి బింధుమాధవ్

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం, సామర్లకోట పోలీస్‌స్టేషన్లలో ఎస్‌పి జి.బిందుమాధవ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. తొలుత పెద్దాపురం స్టేషన్‌కు వచ్చిన ఆయన అన్ని విభాగాల రికార్డులను పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్ కు సంబంధించి కేసుల నమోదు, పరిష్కారం, ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీహరి రాజు, ఇన్‌ఛార్జ్ సిఐ కృష్ణ భగవాన్, ఎస్ఐ వి.మౌనిక, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన సామర్లకోట పోలీస్ స్టేషన్‌ను తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్లో రికార్డులను పరిశీలించి స్టేషన్ పరిధిలో నేరాల పరిస్థితి, ట్రాఫిక్ ఇబ్బందులు వంటి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులో మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో పట్టణ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా కృషి చేయాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

ప్రజాశక్తి - పిఠాపురం

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక బస్టాప్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్, పబ్లిక్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ కోసం వివరించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ వాటి ప్రాముఖ్యతను తెలిపారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రమాదల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మణికుమార్, భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ ఛైర్మన్ మూర్తి మృతి

ప్రజాశక్తి - పిఠాపురం


ఎస్ఎస్ఆర్.మూర్తి

ప్రముఖ వైద్యులు, పిఠాపురం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ ఎస్ఎస్ఆర్.మూర్తి(87) కొంతకాలంగా మంచానికే పరిమితమైన ఆయన వయో భారంతో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈయన 2000 నుంచి 2005 మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రజలకు సేవలందించారు. పట్టణంలోని సౌగంధి అపార్టుమెంట్ వద్ద భౌతికాయాన్ని ఉంచారు. పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.